ప్రజాశక్తి
సోమవారం 4 ఆగస్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

మృత్యు గని

- బల్లికురవ, సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం
- ఆరుగురు వలస కార్మికులు దుర్మరణం
- ఇద్దరికి తీవ్రగాయాలు
- కార్మికులందరూ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వారే..
- మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం
- తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

3వ పేజీ



క్వారీలో ప్రమాదం జరిగిన ప్రాంతం



అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో కార్మికుల మృతదేహాలను సందర్శిస్తున్న సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

పాలకులు మోపే భారాల నుండి ప్రజల్ని విముక్తి చేయాలి

3వ పేజీ

మా భూమిని కాపాడాలి

బాధితురాలు మంగమ్మకు మద్దతుగా గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ సమీపంలోని పెద్ద నాగులవరం రెవెన్యూ ఇలాఖాలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇటీవల కాలంలో ప్రభుత్వ భూమితో పాటు కొంత ప్రయివేటు వ్యక్తులకు చెందిన భూమిని ఆక్రమించి వెంచర్ వేసిన విషయం పాఠకులకు విదితమే. ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై అధికార యంత్రాంగం కదిలింది. గత నెల 18వ తేదీన ఆక్రమిత ప్రభుత్వ భూమిలో కంచెను కొంతభాగం తొలగించారు. ఇటీవల కాలంలో మరికొంత భాగాన్ని తొలగించారు.

పెద్ద నాగులవరం గ్రామానికి చెందిన మల్లే మంగమ్మ తాలూకు చెందిన భూమి కొంత ఆక్రమణలో ఉంది. దాని ఆక్రమణ తొలగించలేదు. ఇటీవలే ఇదే భూమి విషయంలో రియల్టర్‌తో పాటు బాధితురాలు మల్లె మంగమ్మను రెవెన్యూ కోర్టులో విచారించారు. ఆ వెంచర్‌లో ప్రయివేటు వ్యక్తుల భూమి ఉన్నట్లు తేలింది. సర్వే నెంబర్ 153లో 0.20 సెంట్లు, 154/1లో ఎ॥ 1.75 సెంట్లు భూమిని అదే వెంచర్‌లో కలిపేసుకున్నారని గుర్తించారు. ఆ భూమి ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి లభించకపోవడంతో బాధితురాలు మల్లే మంగమ్మకు మద్దతుగా ఆ గ్రామానికి చెందిన పలువురు ఆక్రమిత వెంచర్‌లో ఆదివారం ధర్నాకు దిగారు. తమ భూమిని కాపాడాలని నినాదాలు చేశారు.



ఆక్రమిత భూమిలో ధర్నా నిర్వహిస్తున్న బాధితులు



పుస్తకావిష్కరణలో హైకోర్టు అడ్వకేట్ సంగమ్

'అభయ-ది డెస్టినీ ఆఫ్ యూనివర్స్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రముఖ పుస్తక రచయిత అనిత రాసిన 'అభయ–ది డెస్టినీ ఆఫ్ యూనివర్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎపి హైకోర్టు న్యాయవాది, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు తోట సంగమేశ్వరరావు (సంగమ్) హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంగమేశ్వరరావు మాట్లాడుతూ 'అభయ' అనే పదం ధైర్యానికి, నమ్మకానికి ప్రతీక అని తెలిపారు. కేవలం ఒక వ్యక్తి సొంతానికి మాత్రమే పరిమితం కాకుండా ఇతరులకూ ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చే పదమని పేర్కొన్నారు. విశ్వం మొత్తానికి అభయపూరితమైన స్థితిని చేరుకోవడం విశ్వం యొక్క గమ్యమని అన్నారు. మహిళలు పురోగమన పూర్వక రచనలు చేయడం చాలా అవసరమని, అలా ముందుకు వచ్చిన డాక్టర్ అనితకి అభినందనలు తెలపకుండా ఉండలేమన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత అనిత, లెక్చరర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ వికాస్' విద్యార్థుల ప్రతిభ

ఇద్దరు కానిస్టేబుల్‌గా ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం 2025 జూన్‌లో నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షల ఫలితాలలో స్థానిక ఒంగోలు అంజయ్య రోడ్‌లోని శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె మోహనరావు, డైరెక్టర్ పి వీరయ్య తెలిపారు. తమ కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందిన దర్శి పట్టణానికి చెందిన ఎస్‌కె ఫజులున్ రాష్ట్ర స్థాయిలో 110 మార్కులతో 173వ ర్యాంక్, పంగులూరుకు చెందిన పి పావని 120 మార్కులు సాధించి కానిస్టేబుల్స్‌గా ఎంపిక అయినట్లు తెలిపారు. కానిస్టేబుల్ ఫలితాలలో విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె .మోహనరావు డైరెక్టర్ పి వీరయ్య అభినందించారు.



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

మూడో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఇనముక్కల గ్రామంలో గణపతి, పోలేరమ్మ, ఆంజనేయస్వామి, అంకాలమ్మ దేవతల మూడో వార్షికోత్సవ వేడుకలు శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. కాకర్ల లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుండే పూజారులు హెూమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. గ్రామమంతా శుభ్రంగా అలంకరించబడింది. దేవాలయాల వద్ద పూల తోరణాలు, వెలిగించిన దీపాలతో ఆధ్యాత్మిక వైభవం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయంగా బోనాలతో పాల్గొని ఊరేగింపులో నడిచారు. బాజా బండలతో సాగిన శోభాయాత్రలో గ్రామ యువత, చిన్నారులు సాంప్రదాయ నత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. భక్తుల కోలాహలంతో గ్రామం దద్దరిల్లింది. ఈ వేడుకల్లో పలు పరిసర గ్రామాల ప్రజలు కూడా విచ్చేసి పూజారుల ఆశీర్వాదం పొందారు.

ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలపై

మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత – సేవల పెంపునకు ప్రభుత్వ రంగ సంస్థల–కంపెనీల కార్యకలాపాలు– ప్రాజెక్టులు, గత 5 సంవత్సరాలలో కేటాయించిన నిధులపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయక మంత్రి సురేష్ గోపి సమాధానమిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు–కంపెనీలు లాభాలనే కాకుండా సామాజిక, పర్యావరణ, దాతృత్వ, నైతిక, ఆర్థిక రంగాలకు సంబంధించి సుస్థిరత సాధనకు కార్యకలాపాలు, ప్రాజెక్టులు తప్పక నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ప్రకాశం జిల్లాలో పలు ప్రభుత్వ రంగ సంస్థలు ఆరోగ్యం, విద్యుత్, విధ్య, ఇండ్లు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, పర్యావరణ, వృద్ధులు, మత్స్యకార తదితర సంఘాలకు, వికలాంగులకు సంబంధించి సుస్థిరతను సాధించేందుకు పలు కార్యకలాపాలు, ప్రాజెక్టులు చేపట్టామన్నారు. త్వరలో ప్రభుత్వ రంగ సంస్థల పాలకమండళ్లు వాటి నిర్వహణకు అధికారాలు కలిగి ఉంటాయని, ఆ సంస్థలు స్వయంగా, ఎంపిక చేయబడిన ఏజన్సీల ద్వారా నిర్వహిస్తాయని తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, స్వచ్ భారత్ స్వచ్ విధ్యాలయ అభయాన్ సంస్థ, ఇండో జర్మన్ ఇన్స్టిట్యూట్, ఏపి న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ అభివద్ధి కార్పోరేషన్, ఏపిఎస్ స్కిల్ అభివద్ధి కార్పోరేషన్, హిందుస్తాన్ ప్రిఫాబ్ లిమిటెడ్, ప్రభుత్వ పాఠశాలలు, సోలార్ పివి ఎనర్జీ, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు – కంపెనీలు అనేక కార్యకలాపాలు, ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, ప్రకాశం జిల్లాలోను అమలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

జిల్లా అభివృద్ధిపై మాట్లాడని చంద్రబాబు

- కోతలు,వాతలతో సరిపెట్టిన రైతు భరోసా
- రంగస్థలం సినిమా సెట్టింగ్‌ను తలపించిన.. బాబు భరోసా కార్యక్రమం
- ఏపీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సైదా

ప్రజాశక్తి-పొదిలి

రైతుల్లో భరోసా నింపని చంద్రబాబు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రారంభ కార్యక్రమం, రంగస్థలం సినిమా సెట్టింగ్‌ను ఈ కార్యక్రమం తలపించేదిలా ఉందని పిసిసి అధికార ప్రతినిధి డిసిసి అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ 76 లక్షల మంది రైతులకు బ్యాంకు ఎకౌంట్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమ చేస్తామని వాతలు, కోతలతో కేవలం 46 లక్షల మందికి మాత్రమే రైతు భరోసా కల్పించడం రైతుల్ని మోసగించడమే అన్నారు. ఒక్క ప్రకాశం జిల్లాలోని 5 లక్షల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు ఉండగా కేవలం 2,65,317 రైతులకు రైతు భరోసా నిధులు జమ చేయడం సహేతుకం కాదన్నారు. ఇది రైతు సుఖీభవ కాదు.. రైతుల శోకోభవ!గా ఈ పథకానికి నామకరణం చేస్తే మంచిదని ఆయన ఎద్దేవా చేశారు. పచ్చని పొలాల మధ్యలో సూర్య భగవానుడి భగభగలతో వేసిన నులక మంచాలు విరిగి పోవడంతో రైతు సభ సమాప్తం అయిందని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు ప్రస్తావించకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులకి నష్టపరిహారం చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు పూర్తిగా వైఫల్యం చెందాయని సైదా తీవ్రంగా విమర్శించారు.



ఖాళీ జాగా.. వేసేయ్ పాగా..

బరితెగించిన ఆక్రమణదారులు • పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-తర్లుపాడు

ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములు ఖాళీగా ఉంటే కొందరు ఆక్రమణదారులు పాగా వేసేస్తున్నారు. గ్రామ అవసరాల కోసం ఉపయోగపడే గ్రామకంఠం భూమిని కూడా కొందరు ఆక్రమించుకొని, కాంప్లెక్సులు, వ్యాపారాలకు ఉపయోగపడే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తతంగమంతా కళ్లెదుటే జరుగుతున్న మాకేం సంబంధం లేనట్లుగా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని కేతగుడిపి బస్టాండ్ సెంటర్లో సచివాలయం సమీపంలో గ్రామ కంఠం భూమి సర్వేనెంబర్ 46/2 లో 16 సెంట్లు భూమి ఉంది. ఆ సర్వే నెంబర్‌లో ఆక్రమణదారులు వ్యాపారానికి ఉపయోగపడే దుకాణాలను ఏర్పాటు చేసుకొని, దాని చుట్టూ ప్రహరీ గోడలు ఇష్టారాజ్యాంగ నిర్మించుకుంటున్నారు. సచివాలయం సమీపంలో కళ్ల ఎదురుగానే ఈ ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ సంబంధించి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి భారీ స్థాయిలో ముడుపులు తీసుకొని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దుకాణాల్లోనే అక్రమ మద్యం దుకాణాలు కూడా నిర్వహించి మందుబాబులకు అడ్డాగా మార్చారు. దీంతో అటు వెళ్లాలంటేనే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ గ్రామకంఠం భూమిలో గతంలో గ్రామ రచ్చబండ కార్యక్రమానికి ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం ఈ భూమిని ఆక్రమించడంతో రాములవారి దేవస్థానం వద్ద గ్రామ సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ కంఠం భూమిలో ఆక్రమణలను తొలగిస్తారో? లేదో వేచి చూడాల్సిందే.



గ్రామకంఠం భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణం

ప్రజాశక్తి 3
సోమవారం 4 ఆగస్టు 2025

- బల్లికురవ, సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం
- ఆరుగురు వలస కార్మికులు దుర్మరణం
- ఇద్దరికి తీవ్రగాయాలు
- కార్మికులందరూ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వారే..
- మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం
- తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

'మృత్యు' గని

ప్రజాశక్తి-బల్లికురవ, బాపట్ల జిల్లా

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులను కొండరాళ్లు చిదిమేశాయి. క్వారీలో పనిచేస్తున్న కార్మికులపై గ్రానైట్ రాళ్లు పడటంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మృతిచెందారు. ఇంకో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బల్లికురవ సత్య కష్ణ గ్రానైట్ క్వారీలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగింది. వీరంతా పొట్టకూటి కోసం ఒడిస్సా రాష్ట్రం నుండి వచ్చిన వలస కార్మికులు..


మృతిచెందిన కార్మికులు

వలస కార్మికులు 16 మంది రోజూమాదిరిగానే పనికి వెళ్లారు. పక్కనే 150 అడుగుల ఎత్తులో ఉన్న గ్రానైట్ క్వారీ దిగువ భాగంలో వారు ఆరు జాకీలతో డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో పైనుండి సుమారు 15 టన్నుల పైబడిన బండరాయి జారి కింద పడటంతో ఘటనా స్థలంలోనే నలుగురు మృత్యువాత పడ్డారు. చాలా బరువైన గ్రానైట్ రాళ్ళ తాకిడికి కార్మికుల మృతదేహాలు గుర్తుపట్టని రీతిలో ఛిద్రమయ్యాయి. మరో ఇద్దరు కార్మికులు నర్సరావుపేట ప్రయివేట్ వైద్యశాలకు తరలిస్తుండగా..మృతిచెందారు. మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఆదివారం ఉదయం 10.20 నిమిషాల ప్రాంతంలో వీరు పని చేస్తున్న ప్రదేశంలో ఒక్కసారిగా ఎగువ భాగం నుంచి గ్రానైట్ రాయి జారి కింద ఉన్న కార్మికులపై పడింది. గత కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు అక్కడ ఉన్న మట్టి కరిగిపోయి గ్రానైట్ బండలు జారిపడినట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారు, క్షతగాత్రులందరూ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వలస కార్మికులే. ప్రమాదంలో దండ బడత్య (48), టకున దలాయ్ (37), బనమల బెహ్రా (30), భాస్కర్ భిషోయ్(40), సంతోష్‌గౌడ్ (36), ముస్రాజన (43) మరణించగా.. ఏ.సుదర్శన్, అలక్ నాయక్, సిరా గౌడ, ఎస్. వెంకయ్య, ఎల్ సుభాష్ మాలిక్, పవిత్ర బెహ్రా, శాంతనాయక్, దంబా అను వారు గాయపడ్డారు. క్షతగాత్రులంతా 30 సంవత్సరాల లోపు వారే. కాగా సత్య కృష్ణ గ్రానైట్ క్వారీ యాజమాన్యం వివరాలు అందజేయడానికి అందుబాటులో లేరు. ఘటనా స్థలాన్ని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడి పరిశీలించారు. ఘటనా స్థలంలోకి మీడియాని కూడా రానీయకుండా సత్యకృష్ణ గ్రానైట్ క్వారీ యాజమాన్యం నిలువరించింది. ఎవరినీ ఆ ప్రాంతానికి వెళ్ళనీయకుండా కట్టడి చేశారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ జరగలేదని మీడియా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం విషయమై తహశీల్దార్ ఎం.రవినాయక్ ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మైనింగ్ డిడి రాజశేఖర్, ఏడి రామచంద్ర, సంతమాగులూరు సిఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభి ప్రమాద స్థలంలో వివరాలు సేకరించారు. ఎస్ఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నర్సరావుపేటలోని ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

బాధితులకు కలెక్టర్ పరామర్శ

నర్సరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బల్లికురవ గ్రానైట్ క్వారీ ప్రమాద క్షతగాత్రులను బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి కలెక్టర్ క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్వారీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరపనున్నట్లు చెప్పారు. బాధితులందరూ ఒడిశా రాష్ట్రానికి చెందినవారని తెలిపారు. వర్షాల కారణంగా క్వారీలో ఉన్న మట్టి కదలడంతో గ్రానైట్ బండలు కిందికి జారిపడ్డాయని తెలుస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.14 లక్షల చొప్పున పరిహారం. తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం, స్వల్ప గాయాలైనవారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెప్పారు. గాయపడిన వారందరికీ పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రుల దిగ్భ్రాంతి

గ్రానైట్ రాళ్ల విరిగిపడి ఆరుగురు కార్మికులు మృతిచెందడంపై మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో వద్ద ఉన్న కార్మికుల మృతదేహాలను జిల్లా జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు పరిశీలించారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

బల్లికురవలోని సత్యక్రిష్ణ గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆరుగురు వలస కార్మికులు చనిపోవడం బాధాకరమని, వారి మరణానికి సరైన భద్రతాచర్యలు తీసుకోపోవడమే కారణమని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. బల్లికురవలో జరిగిన ప్రమాద స్థలాన్ని సిఐటియు నాయకత్వంతో కలిసి పరిశీలించిన అనంతరం గంగయ్య మాట్లాడుతూ ఎస్‌కె క్వారీలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన ఒరిస్సా వలస కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు అద్దంకి ప్రాంత నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్వారీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అద్దంకి: నిబంధనలు పాటించని క్వారీలు వెంటనే మూసివేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి డిమాండ్ చేశారు. బల్లికురవ మండలంలోని క్వారీలో ఆరుగురు మత్యువాతపడటం ఘోరమైన దురంతమని పేర్కొన్నారు. సంబంధిత క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్వారీ ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఆమె అక్కడకు చేరుకుని మృతదేహాలను సందర్శించారు. బల్లికురవలో క్వారీల లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా, లేవా.? అనేది పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మజుందార్, తంగిరాల వెంకటేశ్వర్లు, బి విజయ్ కుమార్, పి ఆదామ్, కరీముల్లా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకులు మోపే భారాల నుండి

ప్రజల్ని విముక్తి చేయాలి

- దీనికి ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజలపై భారాలు మోపే పాలకవర్గాల నుంచి ప్రజల్ని విముక్తి చేయడానికి ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక సుందరయ్య భవన్‌లో ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్‌తో కలిసి రమాదేవి మాట్లాడారు. అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ హిందూత్వ పేరుతో పాలకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలు లూటీ చేసేందుకు వీలు కల్పిస్తున్నట్లు మండిపడ్డారు. ఇందులో భాగంగానే కార్పొరేట్ కంపెనీలకు అత్యంత విలువైన వ్యవసాయ భూములు అప్పనంగా కట్టబెడుతున్నట్లు ధ్వజమెత్తారు. మరో వైపు రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. రైతులను ఆదుకుంటానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దర్శి పంట పొలాల్లో మీటింగ్ పెట్టి కేవలం 5 వేల రూపాయలు అకౌంట్లలో వేస్తే సమస్య తీరుతుందా.? అని ప్రశ్నించారు. రూ.వెయ్యి కోట్లు కేటాయించి వర్జీనియా, బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని గగ్గోలు పెడుతుంటే, దీనిపై ఎటువంటి ప్రకటన చేయని ముఖ్యమంత్రి ఎన్ని అబద్ధాలు చెప్పి నమ్మిస్తారని ప్రశ్నించారు. రూ.లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో రాష్ట్రానికే వెన్నెముకగా భావించే రైతులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించలేరా.? అని ప్రశ్నించారు. రైతులను ఆదుకోలేని ముఖ్యమంత్రి రూ.లక్ష కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయగలడా.? అన్న సందేహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో అమరారాజా కంపెనీ జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో, చిన్నాచితక ఫ్యాక్టరీలు మూతపడి మామిడికాయ ధరలు పడిపోయాయన్నారు. కనీసం కూలి కూడా దక్కని పరిస్థితుల్లో మామిడి రైతుకు రూ.100 కోట్లు కేటాయించి కొనుగోలు చేయమని కోరినా ముఖ్యమంత్రికి చెవికెక్కలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉండగా, మరో వైపు నిత్యావసర ధరలను నియంత్రించకపోవడం, టోల్ ధరలు అదుపు చేయకపోవడం వంటి పరిణామాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఈ పాటికే ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు వంటి విద్యుత్ భారాలు ప్రజల్ని ఇక్కట్లకు గురిచేస్తుంటే, స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రచారం చేపట్టిన ప్రభుత్వ నేతలు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తూ ప్రజల్ని దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే అమృత్ నిధులు వస్తాయని ప్రజల్ని మభ్యపెట్టి, అమృతం పాలకులు సేవించి హలాహలం ప్రజలచే తాగిస్తున్నారని ధ్వజమెత్తారు. అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే ప్రభుత్వ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజావేదికల ద్వారా ప్రజలను చైతన్యపరచి విద్యుత్ భారాల నుంచి ప్రజలను విముక్తులను చేయవలసిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నం సాగిస్తున్నట్లు వివరించారు. స్వతహాగా ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి పవన్‌కళ్యాణ్ చరిత్రను వక్రీకరించి మైనారిటీల మనోభావాలు దెబ్బతీసే రీతిలో సినిమా విడుదల చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలో కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులు సనాతన ధర్మం పేరున విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. ఇటువంటి చర్యల వల్ల ఏడాది తిరక్కుండానే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా భారతదేశంలో మోడీ ప్రభుత్వం హిందుత్వ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు కాపాడే రీతిలో వ్యవహరిస్తున్నట్లు దుయ్యబట్టారు. ప్రజల్లో ప్రాంతాలు, మతాలు పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు చేపడుతున్నట్లు ఆరోపించారు. భారతదేశంపై ట్రంప్ జోక్యం పెంచే రీతిలో మోడీ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు వంటిదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవలసిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తొలుత తొలితరం మార్క్సిస్టు ఉద్యమ నిర్మాతల్లో చివరి వారు విఎస్ అచ్యుతానందన్, బెంగాల్ పార్లమెంట్ మాజీ సభ్యులు నేపాల్ భట్టాచార్య తదితరులకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు, మండల, పట్టణ కమిటీ సభ్యులతో పాటు జిల్లాలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా ప్రక్రియను ఉపసంహరించాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా రూపొందించే ప్రక్రియను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాబు పేర్కొన్నారు. ఆదివారం నాడు సుందరయ్య భవన్ జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా పేరుతో ఓట్లు తొలగించే చర్యలు చేపట్టారని, ఈ ప్రక్రియను నిలువరించేందుకు ఆగస్టు 8న జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5న విద్యుత్ భవన్ వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక చేపట్టిన ధర్నాకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తీర్మానం చేశారు..

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలి



ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - పర్చూరు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈనెల 5న జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. ప్రజా వేదిక ఆధ్వర్యంలో సిపిఎం కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మంత్రి లోకేష్ అవే మీటర్లు, అదే కాంట్రాక్టర్లను ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బండి శంకరయ్య, డేవిడ్, బి చినదాసు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య పాల్గొన్నారు.

అమృతలూరు : స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి అగస్టీన్ కోరారు. మండలంలోని కూచిపూడిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, పగలు కొట్టమని చెప్పిన మంత్రి లోకేష్ ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లను బిగించాలని కోరటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి రాజు, కె శాంసన్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న ప్రజాసంఘాల నాయకులు

వేమూరు : ప్రజలను దోపిడీ చేసే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు బి అగస్టిన్ కోరారు. చుండూరు, చినగదేలవర్రు, చిన్నపరిమి గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలను దోపిడీ చేయడంలో వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన అన్నీ ఒకేదారిలో ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు కె శ్రీమన్నారాయణ, కె వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.




చుండూరులో కరపత్రాలు చూపుతున్న గ్రామస్తులు

రైతుల సమస్యలపై పనిచేయాలి : నరేంద్రవర్మ

ప్రజాశక్తి - కర్లపాలెం

రైతుల సమస్యల పట్ల అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని పేరలి గ్రామంలో చింతాయపాలెం పిఏసిఎస్ ప్రెసిడెంట్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం ఆదివారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చింతాయపాలెం కో అపరేటివ్ సొసైటీలో 600 మంది సభ్యులు ఉండగా 6375 మంది రైతులు రుణాల రూపంలో లబ్దిపొందు తున్నారని అన్నారు. సొసైటీ చైర్మన్ మద్దిబోయిన తిరుపతయ్య, డైరెక్టర్లు కోసనా రామయ్య, మార్పు పద్మారావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏపూరి భూపతిరావు, పమిడి భాస్కరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాడా శ్రీనివాసరావు, కోమట్ల కృష్ణ, చలపతిరెడ్డి, బీజేపీ నాయకులు షేక్ బాష, జనసేన నాయకులు చిలకల సురేంద్ర, ముదునూరి రామరాజు, కట్టా సుజాత, సయ్యద్ రఫి, పఠాన్ అహ్మద్ బాష, కరిముల్లాఖాన్, ప్రకాశరావు, మునిపల్లే చిన్న, మేకల యిర్మీయా పాల్గొన్నారు.



పిఎసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో నరేంద్రవర్మ

స్వర్ణకారుడు వెంకటేష్ వినూత్న కృషి

◆ అరుదైన సూక్ష్మ కళతో చెస్‌బోర్డు రూపకల్పన ◆ ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరెన్నో సూక్ష్మ కళాద్భుతాలు



బియ్యం గింజకంటే చిన్నవి తయారు చేసిన చెస్ కాయిన్స్

ప్రజాశక్తి - చీరాల

భారత మహిళల క్రీడా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన సందర్భంలో చీరాల పట్టణానికి చెందిన స్వర్ణకారుడు నక్కా వెంకటేష్ తన అరుదైన సూక్ష్మ కళతో దేశభక్తిని చాటిచెప్పాడు. ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకున్న కోనేరు హంపి, దివ్య దేశముఖ్ పోటీలో భారత్‌కి విజయం ఖాయమైందని చెబుతూ వారికి గుర్తుగా సూక్ష్మ చెస్ బోర్డు రూపొందించాడు. ఈ చెస్ బోర్డు ప్రత్యేకతేంటంటే వెండి, బంగారం ఉపయోగించి రూపొందించారు. ఈ బోర్డు కేవలం 3 గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది. పరిమాణం 3.3 సెంటీమీటర్లు. దీనిపై బియ్యం గింజ సైజులో రాజు, రాణులు, ఆవగింజంత చిన్న బటులు, గుర్రాలు, ఏనుగులను శిల్పకళలో మలిచాడు. ప్రతి ముద్ద మైక్రో లెవెల్లో తయారు చేయబడిన ఈ చదరంగపు బోర్డు సూక్ష్మకళకు ప్రతీకగా నిలుస్తోంది. ఇలాంటి కళలను ప్రభుత్వం ప్రోత్సహించి కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

చెస్ క్రీడాకారాణిలకు అంకితం : వెంకటేష్


చెస్ ప్రపంచకప్ ఫైనల్‌లో కోనేరు హంపి, దివ్య దేశముఖ్ భారతీయ మహిళలు ఇద్దరూ తలపడడంతో ఇక ఛాంపియన్ కప్ ఇండియా ఖాతాలో పడిపోయిందని, తాను తయారు చేసిన సూక్ష్మ చెస్ బోర్డును ఫైనల్‌లో తలపడిన ఇరువురు క్రీడా కారులకు అంకితం చేస్తానని సూక్ష్మ కళాకారుడు నక్కా వెంకటేష్ అన్నారు. ఇద్దరు మహిళా చెస్ క్రీడాకారణీల పోరాటం ప్రపంచంలో భారత్ స్థాయిని చాటిందని, వారికి గుర్తుగా ఈ చెస్ బోర్డు తయారు చేశానని అన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహిస్తే మరెన్నో అద్భుతంగా తయారు చేస్తానని అన్నారు.

అద్భుత శిల్పకళలో భగీరథ

అనేక మినియేచర్ ఆర్ట్స్ రూపొందించి వెంటేష్ ప్రతిభ చాటారు. ప్రపంచ కప్ ట్రోఫీ, అమరవీరుల స్మారక చిహ్నాలు, పుణ్యక్షేత్రాల మోడళ్లు, జాతీయ పతకాల మినియేచర్ వంటి అనేక అరుదైన కళా కృతులతో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మినీ ఇండియా మ్యాప్ బంగారంపై చెక్కిన విద్యాసాధన అతని ప్రత్యేక శిల్పం.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

ఇలాంటి కళల అభివృద్ధికి ప్రభుత్వం, కళా సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, అంతర్జాతీయ స్థాయిలో ఇవి ప్రదర్శించబడి దేశ కీర్తిని పెంచే అవకాశం ఉందని కళాకారులు భావిస్తున్నారు.



చెస్ బోర్డు చూపిస్తున్న కళాకారుడు నక్కా వెంకటేష్



సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కోనేటిపురంలో రూ.5లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చేతుల మీదుగా ఆదివారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీ అభ్యర్థన మేరకు గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరగా సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, నాయకులు మల్లేశ్వరరావు, నాగబాబు, స్థానిక నాయకులు పడమటి ఏడుకొం డలు, గుర్రం నాగబాబు, జల్లి కుటుంబరావు, జంపని శ్రీనివాస రావు, మురాల పుల్లయ్య, జంపని ప్రసాదు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి ప్రసన్నకుమారి

సమస్యల ఊసెత్తని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎటువంటి ప్రాధాన్యత లేకుండా ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన కుండా 2వ కేటగిరి ఉద్యోగులు మాత్రమే పాల్గొన్నారు. వివిధ భాగాలకు సంబంధించిన అధికారులు వచ్చామా, మాట్లాడే మా అన్నట్లు వెళ్లారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తీరును వివరించారు. పెన్షన్ల పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో విద్యుత్, మురుగు కాలవల, తాగునీటి సమస్య విలయతాండం చేస్తూంటే ప్రజాప్రతినిధులు, అధికారులు నోరు మెదపలేదు. ఇలాంటి సమావేశాల వల్ల ఉపయోగం ఏమిటని వారిలో వారే మాట్లాడుకోవడం గమనార్హం. సమావేశానికి ఎంపిపి సాదినేని ప్రసన్నకుమారి అధ్యక్షత వహించగా జడ్పిటిసి తుళ్లూరి వెంకటరమణ, ఈఓఆర్‌డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌కు వినతి పత్రం ఇస్తున్న సిబ్బంది

మంత్రి లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎంసిఓలు కోర్టుకు వెళ్లారనే కారణంతో ప్రకాశం జెడ్‌పి సీఈఓ కొంత మంది ఎంసిఓలకు జీతాలు నిలిపి వేసి కొంతమందికి మంజూరు చేశారని, వేతనాలు నిలిపిన ఎంసిఓలకు వేతనాలు మంజూరు చేయాలని మంత్రి లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. డిపిఓ 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన అప్పటి కలెక్టర్ వినయ్ చంద్ మండలానికి ఒకరు చొప్పున 56మందికి మండల స్థాయి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో పంచాయితీ రాజ్ కమిషనర్ రూ.10 వేలు, ఉపాధి హామీ నిధులని ఒకసారి విడుదల చేశారని పేర్కొన్నారు. అప్పటి కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఫైనాన్స్ డిపార్ట్మెంట్ నుండి రూ.15వేల వేతనం ఇవ్వాలని తెలిపారు. ఆ తర్వాత కలెక్టర్ పోలా భాస్కర్ ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. జిఓ 151 ప్రకారం వేతనాలు ఇవ్వాలని లేకలో పేర్కొన్నారని తెలిపారు. తమకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఇంకొల్లు, యద్దనపూడి, సిఎస్ పురం ఎంసిఓలు ఉన్నారు.

6న అద్దంకిలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - పంగులూరు

మెడికల్ అసెస్మెంట్ క్యాంపు ఈనెల 6న అద్దంకిలోని సత్రం బడి దగ్గర జరుగుతుందని ఎంఇఓలు కె నాగభూషణం, జి వీరాంజనేయులు ఆదివారం తెలిపారు. నియోజక వర్గం స్థాయిలో ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో శిభిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లోని 18ఏళ్లలోపు వివిధ రకాల వైకల్యాలు గల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. వినికిడి, దృష్టిలోపం, శారీరక, మానసిక వైకల్యం, ఆటిజం, పుట్టుకతో వచ్చు పక్షవాతం వంటి వారికి ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన ఉపకరణాలు అందిస్తారని తెలిపారు. ఈ క్యాంపుకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకు రావాలని కోరారు. పూర్తి వివరాలకు భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు పి యోహాను 91009 96448, టి అరుణ 95058 45052ను సంప్రదించాలని కోరారు. స్పెషల్ ఎడ్యుకేటర్ భాస్కర మూర్తి పాల్గొన్నారు.



కవి శ్రీకృష్ణసంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సంపత్‌కు విస్తృత కళా పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

తరంగగాన లోకంలో అపూర్వమైన ప్రతిభ ప్రదర్శిస్తున్న కవి శ్రీకృష్ణ సంపత్ కుమార్‌కు పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మ విస్తృత కళా పురస్కారం ఆదివారం అందజేసారు. స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రంలో పద్యకవి డివిఎం సత్య నారాయణ అధ్యక్షతన జరిగిన సభకు చప్పిడి వీరయ్య ఆహ్వానితులను పరిచయం చేశారు. సభలో రణాసి రఘు రామశర్మ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పోలూరి వెంకట శివరామ ప్రసాదు మాట్లాడారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు కవి శ్రీకృష్ణకు రూ.10 వేల నగదు, పట్టు వస్త్రాలు, జ్ఞాపిక, సన్మాన పత్రంల తో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌విఎల్ హనుమంత రావు, నారాయణ, బాలసుబ్రహ్మణ్యం, యువి రత్నం, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, కోశాధికారి చుండూరి మురళీ సుధాకరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, యు దేవపాలన, జి దివాకరదత్తు, ఆర్ రాజశేఖర్, రత్నాకరరాము, వై త్యాగరాజు, మక్కెన వెంకటేశ్వర్లు, పి అంకయ్య పాల్గొన్నారు.

‘అల్లు’కున్న నిర్లక్ష్యం

ప్రమాదకరంగా కరెంటు తీగలు - పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి-పామూరు

ప్రమాదం జరిగితేనే అధికారులు కదులుతున్నారు.. లేకపోతే పట్టించుకునే వారి లేరని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. బీసీ హాస్టల్ ఆవరణలో స్తంభాలకు పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. పిచ్చి మొక్కలు అల్లుకుపోవడంతో గాలికి స్తంభాల వద్ద మంటలు వస్తున్నాయని, గంట గంటకు కరెంటు పోతుందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఎవరూ కన్నెత్తి చూడటం లేదని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో కరెంటు స్తంభాలు వాలి ఉన్నాయి. మరి కొన్ని సెంటర్లలో తీగలు వేలాడుతున్నాయి. కరెంటు బిల్లులు కట్టించుకునేటప్పుడు చూపే శ్రద్ధ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేసేందుకు చూపటం లేదని గోపాలపురం, కాపు వీధి, బీసీ ఎస్సీ హాస్టల్ కాలనీ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. సుందరయ్య భవనం సెంటర్ కూడలిలో పెద్ద స్తంభం కింద భాగం పగుళ్లు ఉంది. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన గురవుతున్నారు. అధికారులు స్పందించి కరెంటు వైర్లకు అల్లుకున్న పిచ్చి మొక్కలు, తీగలను తొలగించి గంటగంటకు పోతున్న కరెంటు సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కాపు వీధిలో ఇంటి ముందు తీగలకు అల్లుకున్న మొక్కలు

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టే ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక రైడ్లు చేపట్టారు. ఆదివారం పట్టణంలోని కొట్లబజారు, ఎంఎస్ఆర్ రోడ్డు, తీగలగొంది తదితరు ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్ల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి పెను నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. మాంసం, కిరాణా మరియు కూరగాయల షాపు ల వద్ద తనిఖీలు చేసి ఫైన్ వసూలు చేశామన్నారు. ఇంకోసారి చేస్తే లైసెన్స్ రద్దు చేసి షాపు మూయిస్తామని హెచ్చరిక జారీ చేశారు. పట్టణంలోని హోల్‌సేల్ మరియు రిటైల్ షాపులపై ఆకస్మిక తనిఖీ నిర్వహించి, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న యజమానులకు రూ.10 వేలు జరిమానా విధించారు. భవిష్యత్తులో మళ్ళీ ఇవి పునవృతమైతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కమీషనర్ వెంట మునిసిపల్ సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు రమణారెడ్డి, నాగలక్ష్మి, నాగజ్యోతి, బాషా తదితరులున్నారు.



తనిఖీ చేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్



220 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజ్ వాకింగ్ ట్రాక్ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 220 మందికి ఉచితంగా బిపి, షుగర్, హెచ్‌బి, ఈసీజీ మరియు పల్స్ఆక్సీమీటర్ పరీక్షలు, పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా నిర్వహిచారు. ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తగిన వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, రజనీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

సీఎం పర్యటన విజయవంతం పట్ల గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో సీఎం చంద్రబాబు సభ సక్సెస్ చేసిన ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు డాక్టర్‌గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసి రైతుల ముఖంలో ఆనందం చూస్తుంటే దరిశి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఓర్వలేక తాడేపల్లి స్క్రిప్టును చదివి హేళన చేయడం ఆయన విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా 75 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి కార్యక్రమాలు నిర్వహించడం మీకు హేళనగా ఉందా అని ప్రశ్నించారు. గొట్టిపాటి కుటుంబం ప్రజలకు సేవ చేసే కుటుంబం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని దొనకొండ, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టిడిపి అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, మరెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, దర్శి, దొనకొండ టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా, తోహీద్, రాష్ట్ర మహిళా నాయకురాలు శోభారాణి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, సోమేపల్లి శ్రీను, సానే సుబ్బయ్య, నీటిసంఘం డిసి అధ్యక్షులు వెలుగొండారెడ్డి, మంచుమాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలి

ఒంగోలు అసెంబ్లీ కోఆర్డినేటర్ బిఆర్ గౌస్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత మార్చి నెలలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ఒంగోలు రైల్వే స్టేషన్ రోడ్డులో తొలగించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ కోరారు. గత మార్చి నెలలో నగరపాలక సంస్థ అధికారులు హుటాహుటిన అర్ధరాత్రి సమయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారన్నారు. ఒంగోలు మున్సిపల్ కమిషనర్ తొలగించిన విగ్రహం ప్రదేశంలో మరో కొత్త విగ్రహాన్ని అదే ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు అటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈనెల 20న రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం ఉందని, ఈ లోపుగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే 20వ తేదీన మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని గౌస్ హెచ్చరించారు.









అంగన్‌వాడీ కార్యకర్తల వెతలు తీరేనా?

- టెక్నాలజీ ఒత్తిడితో అవస్థలు
- జీవన భద్రతల కోసం పోరాటం
- నేడు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

బిడ్డలకు తల్లి ఒడిలో మొదలయ్యే ఆదరణ తర్వాత అంగన్వాడీ కార్యకర్త చేతిలో సంరక్షణగా మారుతుంది. బాల్యం నుంచి 'బడి ఈడు' దాటి స్కూల్‌కు అడుగిడే వరకు చిన్నారులకు అంగన్‌వాడీలు తల్లిని తలపించే సంరక్షకులుగా సేవలు అందిస్తున్నారు. కానీ అటువంటి అంగన్‌వాడీ కార్యకర్తలు నేడు ఆర్థిక, సాంకేతిక, వ్యవస్థాగతంగా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టెక్నాలజీని గత ప్రభుత్వం పంపిణీ చేసిన మొబైల్ ఫోన్లు సపోర్ట్ చేయక పోవడంతో గత ఏప్రిల్ 3న జిల్లా పరిధిలో 13 ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వవాడీ కార్యకర్తలు కాలం చెల్లిన ఫోన్లు తమకొద్దని, ట్యాబులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పిడి కార్యాలయంలో ఫోన్లు అప్పగించారు. ఈ ప్రక్రియను అంగీకరించని కలెక్టర్ తమీమ్ అన్సారీయ అంగన్‌వాడీ సంఘ నేతలతో చర్చించి మైబైల్ ఫోన్లు పనిచేస్తేనే నిర్దేశించిన యాప్స అప్ లోడ్ చేయమని ఆదేశించారు. యాప్స్, టెక్నాలజీ విషయంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగు నెలలు గడచినా హామీలు నెరవేర్చలేదు. దీంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సంఘం పిలుపు మేరకు మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఆధునిక దశలో పాత పద్ధతులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన స్మార్ట్ ఫీచర్లు, మొబైల్ యాప్‌లు, డిజిటలైజేషన్, వాస్తవంగా అంగన్‌వాడీలకు భారంగా మారాయి. ఇప్పటికీ చాలా కేంద్రాలు బేసిక్ అవసరాల కోసం తపిస్తున్న వేళ మొబైల్ హాజరు, ఫేస్ రికగ్నిషన్ వంటి సాంకేతిక ఆదేశాలు మౌళిక వసతులు లేని వాతావరణంలో అమలవుతున్నాయి. జిల్లాలో 2903 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యక్షంగా 2596 కార్యకర్తలు, 2548 ఆయాలు పనిచేస్తున్నారు. మరో 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 22 7కార్యకర్తలు ఉన్నారు.



మొబైల్‌ఫోన్లు పిడికి అందజేస్తున్న కార్యకర్తలు (ఫైల్‌ఫోటో)

2జి ఫోన్‌తో 5జి టెక్నాలజీ ఎలా సాధ్యం?

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 వెర్షన్ యాప్, హాజరు, పోషణ, ఆరోగ్య సేవల డేటా కోసం అవసరమయ్యే మొబైల్ ఆధారిత విధానం పాత ఫోన్లలో పనిచేయక రికార్డింగ్‌కు ఆటంకం కలుగుతోంది.

అంగన్‌వాడీల వాదనలు

80శాతం ఫోన్లు పనిచేయడం లేదు. నెట్‌వర్క్ లేకపోవడం వల్ల హాజరు రికార్డవడం లేదు. డైట్ మంజూరు కూడా నిలిపివేస్తున్నారు. ప్రాజెక్టు అధికారుల ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు.

యూనియన్ డిమాండ్లు

ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్, ఇతర 11 యాప్‌లు కోసం 5జి ట్యాబ్‌లు పంపిణీ చేయాలి. పాత ఫోన్ల రీప్లేస్‌మెంట్ ప్రభుత్వమే భరించాలి. వేతనం పెంపుదల తోపాటు వేతన బకాయిలు చెల్లింపు, ఫోన్ రీఛార్జ్, సెల్ బిల్లు ప్రభుత్వం భరించాలి. పెన్షన్, ఎక్స్ గ్రేషియా, గ్రాడ్యుటీ, ఇతర భద్రతలు అమలు చేయాలి. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రైవేటీకరణ ప్రయత్నం మానుకోవాలి. కార్పొరేట్ జోక్యం, కేంద్ర, నిఘా యంత్రాంగాల వలన స్వతంత్రత పోతోందని ఆరోపణ. శిశు సంరక్షణను హక్కుగా గుర్తించి, అంగన్‌వాడీలను ఇసిసిఇ నోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. పని భారం తగ్గించాలి. అంగన్‌వాడీల పట్ల మానవీయతతో వ్యవహరించాలి. అంగన్వాడీ కార్యకర్తలు పేద ప్రజలకు మాత్రమే కాకుండా ప్రభుత్వం సేవల్ని విస్తరించడానికి కీలకంగా నిలుస్తున్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆహారం, ఆరోగ్యం, మానసిక అభివృద్ధికి మౌలిక వేదిక. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, గ్రామీణ ఆరోగ్య పురోగతిలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న మహిళలు మాత్రం వేతన భద్రత లేక, సామాజిక గౌరవం లేక, ఉద్యోగ విరమణ తర్వాత రక్షిత జీవితం లేక అల్లాడిపోతున్నారు.

డేటా రికార్డే కాదు, గౌరవం అవసరం : ఈదర అన్నపూర్ణ,

టెక్నాలజీతో సరిపోయే సమస్యలు కావని, గౌరవం, సమానత్వం, జీవన భద్రత కల్పించాలని యూనియన్ నాయకురాలు ఈదర అన్నపూర్ణ కోరారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సేవకు మారుపేరుగా నిలిచిన డాక్టర్ రిచర్డ్‌సన్ సాల్మన్

ప్రజాశక్తి - చీరాల

పేదలకు చౌకగా వైద్య సేవలు అందించి సేవకు మారుపేరుగా డాక్టర్ రిచర్డ్‌సన్ సాల్మన్ (78) నిలిచారని పలువురు పేర్కొన్నారు. ఆయన వయో భారతంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు కొండయ్య సాల్మన్ సెంటర్లోనే డాక్టర్ స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఎంతో ప్రావీణ్యం పొంది పేదల వైద్యునిగా గుర్తింపు పొందారని అన్నారు. అలాంటి సేవా భావం కలిగిన వైద్యులు అరుదుగా ఉంటారని అన్నారు. పట్టణంలోని పలువురు వైద్యులు నివాళులర్పించారు.



గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోటరీ ఆధ్వర్యంలో గుండె పరీక్షలు


ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవన్ వద్ద ఉచిత గుండె వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి 60 మంది హాజరు కాగా వారిలో12 మందిని గుండె ఆపరేషన్ల కోసం విజయవాడ హెల్త్ హాస్పిటల్‌కు సిఫార్సు చేసినట్లు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు తెలిపారు. వారం రోజుల్లో విజయవాడ హాస్పిటల్‌కు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. క్యాంపుకు హాజరైన వారందరికీ ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసినట్లు చెప్పారు. గుండె పరీక్షలు విజయవాడ హెల్త్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ నాగ కిరణ్ నిర్వహించారు. కార్యక్రమంలో పిఆర్‌ఒ సతీష్, రోటరీ మెడికల్ క్యాంపు రీజినల్ కన్వీనర్ చిలుకూరి వీరరాఘవయ్య, ట్రెజరర్ షేక్ కాలేషావలి, పెంట్యాల జగదీశ్వరరావు, కరణం హనుమంతరావు, గుర్రం ఆంజనేయులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు సభ్యులు మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంకు చెందిన పెడవల్లి మదనమోహనరావు (85) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందినట్లు ఆయన కుమారుడు పెడవల్లి సాంబశివరావు తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మస్తాన్‌బి, ఉప సర్పంచ్ షేక్ శ్రీనివాసబాబు ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడు అనంతరం పంచాయతీ 7వ వార్డు సభ్యునిగా పనిచేస్తున్నారు. మృతునికి భార్య సోమశంకరమ్మ, కుమారుడు, కోడలు శిరీష, మనువరాండ్రు అమృత, రమ్య, కుమార్తె సుబ్బారావమ్మ, అల్లుడు రాధాకృష్ణ ఉన్నారు. గ్రామానికి చెందిన కోరిటాల సుబ్బారావు, కొత్తపల్లి వెంకట్రావు, పెడవల్లి వెంకటరావు, పెడవల్లి శ్రీనివాసరావు, రావి అప్పారావు, గోవర్ధనరావు, రాము, పెరవల్లి సాంబయ్య, అంబటి శ్రీనివాసరావు, మద్దినేని కోటేశ్వరరావు, హరిదాసుల కోటయ్య, కొమ్మినేని కొండయ్య చౌదరి, జె బ్రహ్మయ్య, ఎం సాంబశివరావు, మండవ కిట్టయ్య తదితరులు పరామర్శించారు.



మోహనరావు (85)

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఉద్యోగాలకు ఎంపికైన స్నేహితులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

స్నేహానికి మించి లోకాన మరొకటి లేదని, కడదాకా విడిపోనిది స్నేహం ఒక్కటేనని రోటరీ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఎంతైనా సంపాదించుకోవచ్చు కానీ మంచి స్నేహితుడిని సంపాదించుకోవటం కష్టం అన్నారు. సూర్యుడి పయనం చీకటి పడే వరకే, తీరం తాకే వరకే కెరటం ప్రయాణం స్నేహం ప్రయాణం లోకం ఉన్నంత వరకు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ళుగా ఎంపికైన న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులైన స్నేహితులు బోయిన వెంకట్రావు, షేక్ రఫీ, షేక్ రబ్బాని, ఆసోది వెంకటరెడ్డి, గోపిని ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షులు పిసి సాయి బాబు, రోటరీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావు, ఇ హరిబాబు, జెవి కృష్ణారావు, జట్టా శ్రీనివాసరావు, కోళ్ళపూడి ఉపేంద్రగుప్త, బూర్లె రామ సుబ్బారావు, ఎల్‌పి కుమార్, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, తటవర్తి సుబ్బారావు, షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

రేపల్లె : స్థానిక భాష్యం పాఠశాల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులతో స్నేహితుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. గుంటూరు జోనల్ అధికారి హృదయ రాజు మాట్లాడారు. తోటి విద్యార్థుల పట్ల సానుభూతి, దయ, సహాయ సహకారాలు, భావాలు అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ భీమరాజు, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, హెచ్‌ఎం వసుంధర, నరసింహ పాల్గొన్నారు.



భాష్యం విద్యార్థులతో ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు

సిఐపై చర్య తీసుకుంటేనే దీక్ష విరమణ

ప్రజాశక్తి - రేపల్లె

రైతు సమస్యలపై పోరాడుతున్న వైసిపి వేమూరు ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబుపై పోలీసులు దాడి చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. అశోక్ బాబును అక్రమంగా పోలీసు స్టేషన్‌కు తరలించి, పిడి గుద్దులతో దాడికి పాల్పడిన సీఐ మల్లికార్జునరావుపై చర్యలు తీసుకునే వరకు దీక్ష విరమించేది లేదని తెలిపారు. మాజీ సిఎం, వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి సూచనల మేరకు అండగా ఉంటామని తెలిపారు. భట్టిప్రోలు గంగోలు కాలువ తూటి కాడ తొలగించాలని అధికారులకు చెప్పగా అధికారులు స్పందించి తూటికాడ తొలగింపు పనులు ప్రారంభించారని చెప్పారు. అయితే శాసన సభ్యులు పనులు చేయనీయకుండా అధికారులను అడ్డుకోవడం సిగ్గుచేటని అన్నారు. దీనికి నిరసనగా రేపల్లె ఇరిగేషన్ డిఈ కార్యాలయం వద్ద దీక్ష ప్రారంభిస్తుండగా సీఐ మల్లికార్జునరావు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారని చెప్పారు. పోలీసు స్టేషన్ నుండి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన అశోక్ బాబు గత మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. సీఐపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకునే వరకు దీక్ష విరమించేది లేదని తెలిపారు. వైద్య సాయం తీసుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు కరేటి శేషగిరి, నాయకులు చిత్రాల ఓబేదు పాల్గొన్నారు.

కారు ఢీ కొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని శాంతినగర్ వద్ద ప్రమాదం జరిగింది. ఒంగోలు నుండి హైదరాబాదు వైపుకు వెళుతున్న కారు ద్విచక్ర వాహన దారుణ్ణి ఢీ కొట్టడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 ఫైలెట్ క్రాంతి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు దర్శి మండలం చిన్న ఉయ్యాలవాడకు చెందిన గాలం కోటేశ్వరరావుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రఘుపతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

శాసన సభ మాజీ సభ్యులు, రాష్ట్ర శాసనసభ మాజీ ఉపసభాపతి కోన రఘుపతి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు బాపట్ల, కర్లపాలెం, పిట్టల వానిపాలెం నుండి ఆయన అభిమానులు, వైసిపి నాయకులు, రాజకీయాలకు అతీతంగా హాజరై గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ తనపై అభిమానంతో వచ్చి తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, వైసిపి శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. బాపట్ల అభివృద్దే లక్ష్యంగా పదవిలో ఉన్నా, లేకపోయినా శ్రమిస్తానని పేర్కొన్నారు. తమపై చూపుతున్న ఆదరాభిమానాలకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో చేజర్ల నారాయణరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, చల్లా రామయ్య, దొంతిబోయిన సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



గజమాలతో రఘుపతికి జన్మదిన శుభాకాంక్షలు



మాట్లాడుతున్న ఎంఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి

టిడిపి పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి - అమృతలూరు

టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి అన్నారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు అన్ని విధాల ఇబ్బందులు పడ్డారని అన్నారు. అభివృద్ధిలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 20ఏళ్ళ వెనకకు పంపించాడని ఆరోపించారు. ఎంపిడిఒ మారుతి శేషమాంబ, తహశీల్దారు నెహ్రూ బాబు, ఈఒపిఆర్డి జె వినయ్ బాబు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోన రఘుపతి

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి పుట్టినరోజు సందర్భంగా వైసిపి దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో చీలు రోడ్డు సెంటర్లో రఘుపతి చేతుల మీదుగా మహిళలు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, చేజర్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మందుబాబులను విచారిస్తున్న టూ టౌన్ సిఐ నాగభూషణం

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతల రీత్యా మందుబాబులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని 2వ పట్టణ సిఐ నాగభూషణం అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు డిఎస్పీ మహమ్మద్ మొయిన్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. దండుబాట ప్రాంతంలో ముగ్గురు యువకులు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ఉండటంతో వారిపై ఓపెన్ డ్రంక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అనమనమూరులో ఆదివారం చోటుచేసుకుంది. మేదరమెట్ల నుండి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఎద్దు ఏడుకొండలు (32) ను గ్రామం నుండి మేదరమెట్లకు వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనం ట్రాక్టరు కాలవలో పడి ఇసుక కిందపడి ఏడుకొండలు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే గ్రామానికి చెందిన కమల సాంబశివరావు బస్సు ఢీ కొని శనివారం మరణించగా ఆదివారం ఏడుకొండలు మృతి కాలనీలో విషాదం నింపింది. కాలనీ అంతా బోరుమంటూ నిశ్శబ్ద వాతావరణంలో ఉంది.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గిద్దలూరు నియోజక వర్గంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. కంభం పట్టణం, కందులాపురం సెంటర్‌లో రూ.243 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. బేస్తవారిపేట పట్టణంలో కోటి 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ, బీటీ రోడ్లను, రాచర్ల మండలం, మేడవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన 33 కెవి సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం గిద్దలూరు టౌన్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగే గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొంటారు.

పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పారిశుధ్య లోపం, మురుగు నీటి నిల్వలతో రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. దోమలు వృద్ధి చెంది దోమకాటు ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు సోకె ప్రమాదం ఉంది. వీటితో పాటు వైరల్ జ్వరాలు పొంచి ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు విజృంభిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవడం వల్ల వ్యాధులు సోకకుండా జాగ్రత్త పడవచ్చని అంటున్నారు. ఈపాటికే జ్వరపీడితులు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. డెంగ్యూ, మలేరియా లక్షణాలున్న వారికి రక్త పరీక్షలు సైతం చేస్తున్నారు.

డెంగ్యూ ప్రమాదకరం

ఏడీస్ ఈజిప్ట్ అనే ఆడదోమ ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు పగటిపూట ఎక్కువగా కుడుతాయి. డెంగ్యూ వైరస్‌లో ఇన్‌ఫెక్ట్ అయిన దోమలే కాకుండా గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. కాబట్టి త్వరగా ఎక్కువ మందికి వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ దోమ మంచినీటిలోనే గుడ్లు పెడుతుంది. ఏడీస్ దోమకాటు తర్వాత 3 నుంచి 14 రోజుల్లో డెంగ్యూ వచ్చే అవకాశం ఉంది. ఆకస్మికంగా జ్వరం, విపరీతమైన కండరాలు, కీళ్లు, కాళ్ళ నొప్పులు, వాంతులతో డెంగీ మొదలవుతుంది. కొంత మందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్త స్రావం అవుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో 80శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది. దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తంలో ప్లేట్ లెట్స్ తగ్గినా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. హెరైజ్డ్, షాక్ సిండ్రోమ్ సోకిన వారిని అత్యవసరంగా ఆసుపత్రిలో చేర్పించాల్సి ఉంటుంది. డెంగ్యూ నిర్ధారణకు మొదటి వారంలో ర్యాపిడ్ కిట్‌తో పరీక్ష చేస్తారు. రెండో వారంలో తీవ్రతను బట్టి ఎలీసా పరీక్షా నిర్వహిస్తారు. డెంగ్యూ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.

మలేరియా పట్ల అప్రమత్తత అవసరం

అనాఫిలస్ అనే దోమకాటు ద్వారా మలేరియా జ్వరం వస్తుంది. ఈ జ్వరం సోకిన వారికి చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం సోకుతుంది. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు రకాల క్రిములు వల్ల డయేరియా వస్తుంది. వైవాక్స్ మలేరియా అంత తీవ్రం కాకపోయిన



ఎక్కువ కాలం బాధిస్తుంది. ఫాల్సిఫారం ప్రాణాంతకం కావచ్చు. చికిత్సతో పాటు నివారణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తాయి. గర్భిణులు, చిన్న పిల్లలు ఈ వ్యాధి తీవ్రతకు ఎక్కువగా గురవుతారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకుని నిర్ధారించుకోవాలి. మలేరియా రకాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు పూర్తి మోతాదులో చికిత్స పొందాలి. నీటి నిల్వలో పెరిగే అనాఫిలిస్ దోమకాటు నుంచి రక్షణ పొందటం ఉత్తమం. టైఫాయిడ్ కలుషిత ఆహారం, కలుషిత నీరు తీసుకోవడం వల్ల వ్యాపించే అవకాశం ఉంది. ఈ వ్యాధి సాల్మొనెల్లా టైఫి అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తీవ్రమైన జ్వరం, కొద్దిగా దద్దుర్లు, చిన్న పిల్లల్లో విరేచనాలు,పెద్దవారిలో మలబద్దకం, కడుపులో నొప్పి, తలనొప్పి, ఆకలి లేకుండా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన వారిలో 10శాతం మంది తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వారిలో పేగుల్లో పుండ్లు పడి రక్తం స్రవించడం ద్వారా తీవ్ర అస్వస్థతకు గురవుతారు. మెదడు, గుండెకు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. బాధితులు సకాలంలో వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలి.

డెంగ్యూకు సకాలంలో చికిత్స అవసరం



డాక్టర్ ఎం గార్గేయి, సిహెచ్‌సి, మార్టూరు

జ్వరం సోకినప్పుడు అశ్రద్ధ చేయకుండా నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మార్టూరు సిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎం గార్గేయి తెలిపారు. డెంగ్యూ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవిస్తుందని తెలిపారు. డెంగ్యూ సోకిన వారితో 20 నుంచి 30 మందిలో ప్లేట్ లెట్స్ తగ్గి పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అధిక జ్వరం, ఒళ్లునొప్పులు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జ్వరం వచ్చినప్పుడు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు.

యువకుల మధ్య తీవ్ర ఘర్షణ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి యువకుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఇద్దరు యువకు లపై కొందమంది యువకులు ఆకస్మికంగా దాడి చేయడంతో ఆ సమయంలో గ్రౌండ్‌లో ఉన్న ఇతరులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక ఆర్ఒబి సమీపంలో నివాసం ఉంటున్న కొందరు యువకులు రెండు వర్గాలుగా చేరారు. వారి మధ్య జరిగిన వాగ్వివాదం దాడికి దారి తీసింది. గులకరాయితో ఒక యువకుని ముఖంపై దాడి చేయడంతో ముఖం నిండా రక్తమైంది. నోటిలో పళ్లు ఊడిపోయినట్లు అక్కడున్న దాడిని చూసిన యువకులు చెబుతున్నారు. మరో యువకునికీ గాయాలు అయ్యాయి. అనంంతరం దాడి చేసిన యువకులు అక్కడి నుండి పారిపోయారు. ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. సిసి కెమేరాలు పరిశీలించి విఠల్‌నగర్ యువకులుగా ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



గాయపడ్డ యువకుడు



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలానికి చెందిన నలుగురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం శాసనస భ్యులు నక్కా ఆనందబాబు సిఫార్సు మేరకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ నిధులు రూ.2.13లక్షల విలువైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ విజయమ్మ

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - రేపల్లె

పుట్టిన బిడ్డకు మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ ఎస్ విజయమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో రేపల్లెలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఉప్పుడి రోడ్ వైద్యశాల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 1 నుండి 7 వరకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆరోగ్య కేంద్రం ఉప్పుడి రోడ్డు వైద్యశాల్లో బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత వివరించారు. డాక్టర్ సముద్రాల రమేష్, డాక్టర్ షేక్ షాహిన్, డాక్టర్ షేక్ నతిక్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

పోస్టుమార్టం ఆలస్యంపై ఆందోళన

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎవరిని లోపలకి పోకుండా ఆందోళన కారులు నిరసన తెలిపారు. మండలంలోని కలవకూరుకు చెందిన దంపతులు నాలుగు రోజుల క్రితం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై దర్శి వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు నాగేంద్రమ్మ స్పీడ్ బ్రేకర్ వద్ద కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం వివిధ ప్రాంతాల్లో అందించినప్పటికీ మృతి చెందారు. ఈ క్రమంలో మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి దహన సంస్కారాలు జరిపే క్రమంలో ముండ్లమూరు పోలీసు స్టేషన్ పరిధిలో ప్రమాద ఘటన జరగగా పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించాలని బాధితులకు సమాచారం ఇవ్వడంతో కలవకూరు నుండి మృతదేహాన్ని 4గంటల ప్రాంతంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్థానిక వైద్యాధికారులు తమ పరిధిలో ఆమె మృతి చెందలేదని, తమకు సంబంధం లేదని, తాము పోస్టుమార్టం నిర్వహించలేమని మృతురాలి భర్తకు, గ్రామస్తులకు తెలిపినట్లు బాధితులు ప్రజాశక్తితో తెలిపారు. జెసి గంగాధర్ గౌడ్ జోక్యం చేసుకుని పోస్టుమార్టం చేయాలని చెప్పినప్పటికీ వైద్యాధికారులు పోస్టు మార్టం నిర్వహించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని తెలిపారు. పోస్టు మార్టం నిర్వహించకపోవడంతో సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మృతదేహాన్ని అడ్డుగా ఉంచి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నిరసన తెలిపారు.

మహిళాభివృద్ధే ధ్యేయం

- మాతృ, శిశుమరణాల నివారణకు ప్రత్యేక చర్యలు

- బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి



ముఖాముఖి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ద్వారా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం, వారికి పౌష్టికాహారం అందించడం, విద్యలో ప్రాథమిక శిక్షణ అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాధామాధవి తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను 'ప్రజాశక్తి'కి వివరించారు.

ఆరోగ్యకరమైన బాలల జననం, వారి రక్షణ కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అధిక పోషకాలు ఉండే ఆహారపదార్థాలను గర్భిణీలు, బాలింతలు, బాలలకు అందించడానికి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు కషి చేస్తున్నాయి. బాలలు ఆరోగ్యంగా ఎదగడానికి ప్రభుత్వం ఎంతగానో కషి చేస్తున్న క్రమంలో గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు నిర్వహించడం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టడం, చిరుధాన్యాలు, చౌకగా దొరికే ఆకుకూరలు, కూరగాయలతో వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను తయారు చేసుకునే విధానాల గురించి తెలియజేస్తున్నారు. మాతృ, శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మహిళలకు పోషకాహార పంపిణీతో పాటు వైద్య సేవలు సకాలంలో అందేలా అంగన్‌వాడీ కేంద్రాలు కృషి చేస్తున్నాయి. 0 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ వారి ఆరోగ్య స్థాయిని మెరుగు పరచటం, పిల్లలు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, ఆరోగ్యంగా పెరగటానికి తగిన పునాది వేయడం, శిశు మరణాల రేటును, పోషకాహార లోపాన్ని అనారోగ్య పరిస్థితులను, పాఠశాల మానివేయడాన్ని తగ్గించటం, పిల్లలను ఆరోగ్యంగా పెంచటం, పిల్లల ఆరోగ్య పోషక అవసరాలకు అనుగుణంగా సరైన పోషణను సమకూర్చటంలో తల్లికి తగిన శిక్షణ ఇచ్చి, తల్లుల నైపుణ్యాన్ని పెంపొందించటం అంగన్‌వాడీ కేంద్రాల ఉద్దేశ్యం.

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 25 మండలాల్లో మొత్తం 9 ప్రాజెక్టులున్నాయి. 77 సెక్టార్లలో 1,888 అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 6,201 గర్భవతులు, 7,119 మంది బాలింతలు ఉన్నారు. 0-6 నెలల వయసు పిల్లలు 7,161 మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 36,157 మంది ఉన్నారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలు 26,008 మంది ఉన్నారు. మొత్తం జిల్లాలోని అంగన్‌వాడీల్లో 69,327 మంది పిల్లలున్నారు. జిల్లాలో అంగన్‌వాడీలకు 594 స్వంత భవనాలు ఉండగా, 474 అద్దె లేని భవనాలు, 820 అద్దె భవనాల్లో కేంద్రాలున్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,849 మంది పనిచేస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 16 మంది, సహాయకులుగా 1,859 మంది ఉన్నారు. 66 మంది సూపర్‌వైజర్‌లు పనిచేస్తున్నారు. సిడిపివో, ఎసిడిపివోలుగా 9 మంది పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మూడు సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాహారంగా బాలామతం, కోడిగుడ్లు, పాలు ఇస్తున్నారు. 3 నుండి 6 సంత్సరాల పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలలో పెడుతున్నారు. గర్భవతులు, బాలింతలకు బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు నెలకు రెండు సార్లు ఇస్తున్నారు. సంపూర్ణ పోషణ కిట్ ద్వారా గర్భవతులు, బాలింతలకు రాగి పిండి, అటుకులు, వేరుశనగ, బెల్లం, ఖర్జూరాలు ప్రతి నెలా సంపూర్ణ పోషణ ద్వారా వీటిని ప్రతి నెలా 5వ తేదీలోపు సప్లయర్ ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు.

ఐసిడిఎస్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలివీ..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు అనుబంధ సేవలు ఇస్తున్నారు. అనుబంధ పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, సలహాలు సంప్రదింపులు, ఆరోగ్య పోషణ విద్య అందిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ ద్వారా 6 సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు 1,888 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ద్వారా 18 సంవత్సరాల లోపు బాలబాలికలు, బాల కార్మికులు, బాలలపై హింస, బాల్య వివాహాలు మరియు సంరక్షణకు అవసరమైన బాలలందరికీ ఈ పథకం ద్వారా రక్షణ కల్పిస్తున్నారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్ ద్వారా బాలికలు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు సామాజికన్యాయం, వైద్యసేవలతో కూడిన నివాస సదుపాయం కలుగజేస్తున్నారు. ఈ సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181 అందుబాటులో ఉంది. బాలసదనాల ద్వారా రక్షణ, సంరక్షణ అవసరం ఉన్న పిల్లల కోసం, అనాథలకు, పాక్షిక అనాథలు, వికలాంగులు, మాజీ సైనికుల పిల్లలు. 5 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, ప్రత్యేక సందర్భాల్లో 16 సంవత్సరాల వరకు పిల్లలు చిల్డ్రన్ హోమ్స్‌లో ఆశ్రయం కల్పిస్తున్నారు. జిల్లాలో 23 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, 13 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు, 3 సిడిపివో పోస్టులు, 11 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ జరగాల్సి ఉంది.